# రైతులకు అండగా ఆర్బీకేలు

సకాలంలో సాగు చేపట్టకపోతే పంట దిగుబడి సక్రమంగా రాదు. దీంతో రైతులు అప్పులపాలు కావాల్సిందే. ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు మంచివి అందుతాయన్న నమ్మకం లేదు. వీటిని దృష్టిలో పెట్టుకున్న జగనన్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా అనేక సేవలు అందిస్తూ అండగా నిలుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - రామచంద్రాపురం



రైతులకు వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

రామచంద్రాపురం మండలంలో 11 పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా భూసార పరీక్షలతోపాటు అన్ని సేవలూ అందిస్తున్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతు పొలం వద్దే భూసార పరీక్షలు చేసి అవసరమైన మేరకే ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. అన్నిరకాల పంటలను ఈ -క్రాప్‌లో నమోదు చేసి వారికి పంటల బీమా అందేలా చేస్తున్నారు. ఆర్బీకే పరిధిలో రైతులకు ఎన్ని రకాల ఎరువులు, పురుగు మందులు అవసరమో గుర్తించి నిలువ చేస్తున్నారు. ఏ పంటకు ఎప్పుడు ఏది అవసరమో అది అందించడంతో రైతుకు వ్యయ ప్రయాసలు తగ్గి సకాలంలో పంటను కాపాడుకోగలుగుతున్నారు. వ్యసాయ పనిముట్ల కోసం అందోళన చెందకుండా రైతు భరోసా కేంద్రాల పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా సబ్సిడీపై యంత్రాలు అందజేస్తున్నారు. మండలంలో 4628 మంది రైతులు ఉండగా 7,901 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అలాగే పశువులు 8,275, గేదెలు 101, గొర్రెలు 4,300, మేకలు 7,500 ఉన్నాయి.

| | |
|---|---|
| మండలంలోని ఆర్బీకేలు | 11 |
| రైతులు | 4628 |
| పంపిణీ చేసిన ఎరువులు | 2300.58 మెట్రిక్ టన్నులు |
| ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి | 234 మెట్రిక్ టన్నులు |
| వేరుశనగ విత్తనాలు | 2200 క్వింటాళ్లు |
| కస్టమ్ హైరింగ్ గ్రూపులు | 11 |
| అందించిన యంత్రాలు | 12 |
| జనుము విత్తనాలు | 155 క్వింటాళ్లు |
| జీలుగ విత్తనాలు | 98 క్వింటాళ్లు |
| వైఎస్సార్ రైతు భరోసా కింద ఇచ్చిన మొత్తం | రూ.242.48 కోట్లు |
| వైఎస్సార్ సున్నా వడ్డీ సాయం | రూ.58 లక్షలు |
| వైఎస్సార్ ఉచిత పంటల భీమా | రూ.54 లక్షలు |
| పంట నష్ట పరిహారం | రూ.89 లక్షలు |

### ఎలాంటి చీకూచింతా లేదు



గతంలో ఎరువులు, పురుగు మందుల కోసం పట్టణాలకు వెళ్లి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. నాణ్యత లేక పంటలు దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడు ఉండేవాడు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాకా అన్నీ ఆర్బీకేల్లోనే దొరుకుతున్నాయి. ఎలాంటి చీకూచింతా లేకుండా సాగు సాగు సులువైంది.

- విజయ్‌కుమార్‌రెడ్డి, రైతు, సూరావారిపల్లి

### ఆర్థిక భారం తగ్గింది



గతంలో పంటలకు ఎంత మేరకు ఎరువులు వాడాలో తెలియక అధికంగా డబ్బులు ఖర్చు అయ్యేవి. భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల ఏ ఎరువులు ఎంతమేరకు వాడాలో తెలిసింది. పెట్టుబడి తగ్గింది. ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు ధర లభిస్తోంది. రైతుపై ఆర్థిక భారం తగ్గింది.

- మునీంద్రయాదవ్, రైతు, పద్మవల్లీపురం

### రైతుభరోసా కేంద్రాలతో సాగు సులువైంది



అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ.89 లక్షలు అందించాం. మండలంలో 4,628 రైతులకు ఆర్బీకేల ద్వారా 2,300 మెట్రిక్ టన్నుల ఎరువులు, వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో 12 యంత్రాలు అందించాం. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. దీంతో రైతులకు సాగు సులువైంది.

- స్రవంతి, మండల వ్యవసాయాధికారి

## నేడు డయల్ యువర్ కమిషనర్

**తిరుపతి తుడా:** తిరుపతి నగరంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా కార్యాలయంలో ఫిర్యాదులు అందజేయవచ్చని తెలిపారు.

## కార్మికశాఖ కార్యదర్శికి ఘన స్వాగతం



కార్మికశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్‌కు స్వాగతం పలుకుతున్న జేసీఎల్ బాలూనాయక్

**తిరుపతి రూరల్:** కార్మికశాఖ రాష్ట్ర కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఆదివారం తిరుపతికి విచ్చేశారు. ఆయనకు ఆ శాఖ కర్నూలు జోన్ జాయింట్ కమిషనర్ బాలూనాయక్, సహాయ కమిషనర్ చిన్నలాలెప్ప, అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లేబూరి రత్నకుమార్ ఘనస్వాగతం పలికారు. జిల్లాలో కార్మికుల సంక్షేమంపై హరిజవహర్‌లాల్ సమీక్షించారు. ఈ–శ్రమ్ నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు.

## క్లుప్తంగా

### ఘనంగా వెంకటేశ్వరస్వామి జ్యేష్ఠాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి

**పాకాల :** మండలంలోని నడింపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జ్యేష్ఠాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు రాజేష్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### వైభవంగా పున్నమి గరుడ సేవ



గరుడవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పున్నమి గరుడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. ఉదయం కల్యాణ మండపంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ చేశారు. రాత్రి పౌర్ణమి సందర్భంగా స్వామి వారు ఉభయదేవేరులతో కలిసి గరుడుడిపై కొలువై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

### మూలస్థాన ఎల్లమ్మకు రూ.50,015 విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళం అందిస్తున్న గురవారెడ్డి

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** చంద్రగిరి పట్టణంలో కొలువైన మూలస్థాన ఎల్లమ్మ ఆలయం పునర్నిర్మాణానికి పిచ్చినాయుడుపల్లికి చెందిన గురవారెడ్డి రూ.50,015 విరాళంగా అందించారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు సన్మానించారు. అమ్మవారి దర్శనం కల్పించారు.

### ప్రతి పల్లెకూ మినరల్ వాటర్ ప్లాంట్



వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి

**తిరుపతి రూరల్:** చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారం, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రతి పల్లెలోనూ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి తెలిపారు. పాతకాల్వ పంచాయతీలో రూ.10.60 లక్షలతో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు ఆదివారం భూమి పూజ చేశారు. మరో మూడు నెలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ పాతకాల్వ పంచాయతీ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఉప సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, నాగభూషణం, చిరంజీవి, లీలావతి పాల్గొన్నారు.

### చురుగ్గా గ్యాస్ పైపులైన్ పనులు

**తిరుపతి మంగళం:** కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా తిరుపతి నగరంలో ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలన్న ఉద్దేశంతో చేపట్టిన గ్యాస్ పైపులైను పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పైపులైను చెన్నై నుంచి పుత్తూరు మీదుగా వస్తోంది. పుత్తూరు నుంచి సుమారు 36 కిలోమీటర్ల దూరం పైపులైను పనులు పూర్తి చేసినట్టు కాంట్రాక్టర్ తెలిపారు. ప్రస్తుతం తిరుపతి–రేణిగుంట రోడ్డు నుంచి శెట్టిపల్లె–మంగళం రోడ్డులో పైపులైను అమరిక పనులు జరుగుతున్నాయి. మంగళంలోని ఆర్టీఏ కూడలి వరకు, అటునుంచి తిరుపతి – కరకంబాడి రోడ్డు ద్వారా ఏర్పాటు చేస్తారు.

## శ్రీవారి సేవకు యువకులు ముందుకు రావాలి

- డయల్ యువర్ ఈవోలో ఎవి.ధర్మారెడ్డి



డయల్ యువర్ ఈవోలో మాట్లాడుతున్న ఈవో ధర్మారెడ్డి

**తిరుమల:** శ్రీవారి సేవకు యువకులు ముందుకు రావాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం తిరుమల అన్నమయ్య భవన్‌లో డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధాలు ఇచ్చారు.

**ప్రశ్న :** శ్రీవారి సేవకు మూడు నెలల ముందు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా సేవ దొరకడం లేదు. నిలిచిపోయిన వారి స్థానంలో మిగిలిన వారికి సేవా భాగ్యం కల్పించండి. – నామాల స్వామి, కాకినాడ

**ఈవో :** పరిశీలిస్తాం.

**ప్రశ్న:** శ్రీవారి ఆలయంలో తోసేస్తున్నారు. – అశోక్, తిరుపతి

**ఈవో :** వేసవిలో రద్దీ అధికంగా ఉంది. దర్శనం కోసం భక్తులు 40 నుంచి 50 గంటలు వేచి ఉంటున్నారు. త్వరగా దర్శనం చేసుకుని తర్వాతి భక్తులకు అవకాశం ఇవ్వాలి.

**ప్రశ్న:** గాలిగోపురం వద్ద దివ్యదర్శనం టోకెన్లు ఇవ్వండి. కింద ఇవ్వడం వల్ల అధిక సమయం వేచి ఉండాల్సి వస్తోంది. – రాజేశ్వరి, ప్రొద్దుటూరు

**ఈవో:** గాలిగోపురం వద్ద స్థలాభావం, తోపులాట, భక్తుల మధ్య గొడవలు జరగడం వల్ల అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌కు మార్చాము.

**ప్రశ్న :** లక్కీ డిప్ బయోమెట్రిక్ స్థానంలో మెషిన్ పెడితే అధిక సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. మొబైల్ ఓటీపీ ద్వారా టికెట్లు పొందే అవకాశాన్ని పరిశీలించండి. – దినేష్, హైదరాబాద్

**ఈవో:** లక్కీ డిప్ మెషిన్ ఏర్పాటును పరిశీలిస్తాం.

**ప్రశ్న :** కోవిడ్ సమయంలో అలిపిరి వద్ద టికెట్లు స్కాన్ చేయడం వల్ల, తిరుమలకు వచ్చేటప్పటికి గదులు దొరుకేవి. అదే విధానాన్ని ప్రవేశపెట్టండి. –నాద విలాస్, ఒంగోలు

**ఈవో:** దీనిపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం.

**ప్రశ్న :** చక్కెర పొంగలి, పులిహోరా, మిర్యాల పొంగలి వంటి అన్నప్రసాదాలను భక్తులకు విక్రయించండి. –శ్రీనివాస్, హైదరాబాద్

**ఈవో:** అన్నప్రసాదాల విక్రయం సాధ్యం కాదు.

## చెవిరెడ్డి దాతృత్వం అభినందనీయం



సంతలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్

**చంద్రగిరి(తిరుపతి రూరల్):** సామాజిక సేవా కార్యక్రమాలతో చంద్రగిరి ప్రజలను కంటిరెప్పలా కాపాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాతృత్వం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. చంద్రగిరి సంతలో ప్రతి వారమూ అన్నదానం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి సంతకు వచ్చే రైతులు, వినియోగదారులు, వ్యాపారుల సౌకర్యార్థం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మూడు పూటలా అన్నదానం చేయడం ఆయన సేవా నిరతికి నిదర్శనమన్నారు. ఆదివారం 1000 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు తానాటి చంద్రశేఖర్ రెడ్డి, నవీన్, చెవిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## సమాజ సేవతో జీవితం సార్థకం




ఉగాది పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

**తిరుపతి కల్చరల్:** సేవాతత్వం సమాజ శ్రేయస్సుకు చక్కటి మార్గదర్శకమని, మానవత్వంతో సేవలు అందించిన వారి జీవితం సార్థకం అవుతుందని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. మహతి కళాక్షేత్రంలో ఆదివారం తిరుపతి సిటీ చాంబర్ వార్షికోత్సవంతోపాటు ఉగాది పురస్కారాలు ప్రదానోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి సిటీ చాంబర్ వారు 26 ఏళ్లుగా ఉత్తమ సేవకులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతిభావంతులు, సేవాతత్పరులను సత్కరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఏపీ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డాక్టర్ పీపీకే.రామాచార్యులు మాట్లాడుతూ తాను విద్యాభ్యాసం చేసిన తిరుపతి నగరంలో నేడు సిటీ చాంబర్ వారి ఉగాది పురస్కారాల కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 13 ఏళ్ల వయస్సులోనే పర్వతారోహణలో ప్రపంచ రికార్డు సాధించిన పూర్ణ మలావత్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, రమాదేవి ఆసుపత్రి అధినేత డాక్టర్ రాధాకృష్ణారెడ్డి, బ్లిస్ గ్రూప్ హోటల్స్ అధినేత మబ్బు సూర్యనారాయణ రెడ్డి, సామాజిక సేవకులు తులసీ నెహ్రూ, అరికాపుడి రఘును జీవిత సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. ఎస్.మునిసుబ్రమణ్యం, తిరుపతి గోల్డ్, సిల్వర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ.సత్యనారాయణ, స్విమ్స్ డాక్టర్ కె.మాధవి, షేక్ హాజీనా భాను, ఎస్.రాజ్‌కుమారి, డి.విజయకుమార్, సోము ఉమాపతి, కొండారవికి ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి సిటీ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్ ఖాన్, చైర్మన్ కేఎస్.వాసు, కార్యదర్శి వై.షణ్ముగం, ఉపాధ్యక్షులు స్టాన్లీ, పీసీ.స్వామి, పీఎస్.కరుణానిధి, సి.స్వరాజ్యలక్ష్మి, విశాలాక్షి పాల్గొన్నారు.

## నేటి నుంచి పోషకాహార భద్రతపై జాతీయ సదస్సు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజులు వ్యవసాయ పరిశోధన–పోషకాహార భద్రత అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరగనుంది. ఈ మేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పీజీ డీన్ గుత్తా రామారావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అలాగే దేశంలోని వివిధ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు, రాష్ట్రాల వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులు 500 మందికి పైగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో భాగంగా పరిశోధక విద్యార్థులు ఆహార భద్రత–పోషకాహారంకై వివిధ పంటల్లో నూతన రకాల రూపకల్పన, ఆధునిక సాగు పద్ధతులు, పంటల ఆరోగ్య సంరక్షణలో వినూత్న మెళకువలు, వాతావరణ మార్పులపై పరిశోధన, వాతావరణ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతిక అభివృద్ధి, పశుపోషణలో మెళకువలు, రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. తద్వారా పీజీ విద్యార్థులకు పరిశోధన అంశాలపై లోతైన అవగాహన కలగడంతో పాటు ఆహార భద్రత, పౌష్టికాహార భద్రత దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు మరింత ముమ్మురంగా చేపట్టడానికి ఈ జాతీయ స్థాయి సదస్సు దోహదపడుతుందని తెలిపారు.

## నేడు దేవరకొండలో వైద్య శిబిరం ప్రారంభం

**భాకరాపేట :** చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ వంగుమళ్లవారిపల్లెలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ యుగంధర్ రెడ్డి, ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. వారు ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం చిట్టేచెర్ల సచివాలయం పరిధిలోని వంగుమళ్లవారిపల్లె, దూదేవాండ్లపల్లె, తుమ్మచేనుపల్లె, బండారువాండ్లపల్లె, చిట్టేచెర్ల సచివాలయం, నగరి, మంగళవారం దీన్‌దార్లపల్లె, తెట్టుపల్లె, బుధవారం భాకరాపేట జెడ్పీ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాల, 8న దిగవూరు సచివాలయం పరిధిలోని గాండ్లపల్లె, పిరమిలవాండ్ల పల్లె, మట్లువారిపల్లె, 9న టీ.చట్టేవారిపాళెం సచివాలయం పరిధిలోని నలపరెడ్డిగారిపల్లె, పొట్టిగానితోపు, వంకమద్దివారిపల్లె, సచివాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తామన్నారు. అదేవిధంగా 10వ తేదీన నెల్లట్లవారిపల్లె సచివాలయం, 11న తిప్పిరెడ్డిగారిపల్లె సచివాలయం పరిధిలోని రెడ్డివారిపల్లె, యడమవారిపల్లె సచివాలయం వద్ద, కుమ్మరపల్లె, 12న జంగావాండ్లపల్లె సచివాలయం పరిధిలో చినిగేపల్లె, బోడిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె, 13న రంగన్నగారిగడ్డ సచివాలయం పరిధిలోని సాయిబూలపల్లె, నల్లఓబులవారిపల్లె, పెద్దపల్లెలో వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. అలాగే 14న చిన్నగొట్టిగల్లు సచివాలయం పరిధిలోని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ స్కూల్, జెడ్పీ హైస్కూల్, వలసారెడ్డిగారిపల్లె, రాజువారిపల్లెలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

## రేకలచేనులో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**రామచంద్రాపురం:** మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేకలచేనులోని శ్రీ జన్మస్థల శివాలయం వద్ద ఆదివారం న్యాయవాది పురుషోత్తం రెడ్డి సహకారంతో తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రుయా హాస్పిటల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ భారతీ మాట్లాడుతూ స్త్రీలలో వచ్చే నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెటర్నిటీ ఆస్పత్రిలో తగిన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కెవీ చలపతి, ఎస్వీ మెడికల్ కాలేజీ, మెటర్నిటీ హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.

## రోడ్డును పరిశీలించిన డిప్యూటీ మేయర్



డివైడర్, సెంటర్ లైట్లు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి మంగళం :** జీవకోన ప్రధాన మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న డివైడర్, సెంటర్ లైట్ల నిర్మాణ పనులను ఆదివారం తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీవకోన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించేందుకు లింకు రోడ్లతోపాటు డివైడర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. డివైడర్ మధ్యలో లైట్లు ఏర్పాటు చేయడంతో కాంతులు వెదజల్లుతాయన్నారు. జీవకోన నగర శివారు ప్రాంతమైనప్పటికీ అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. కార్పొరేటర్ కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, తాళ్ల పాక పెద్ద గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు శారద, 47వ డివిజన్ అధ్యక్షులు మురళి, పార్టీ నాయకులు సురేంద్ర రెడ్డి, కోటి పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణే వైశ్య యూత్ పరిషత్ లక్ష్యం



కార్యాలయ ప్రారంభోత్సవంలో పరిషత్ ప్రతినిధులు, వైశ్య ప్రముఖులు

**తిరుపతి కల్చరల్:** సనాతన ధర్మాన్ని కాపాడడంతో పాటు గోసేవను మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ పనిచేస్తోందని పరిషత్ తిరుపతి శాఖ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఆయన ఆదివారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ రాష్ట్ర శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లోని వైశ్యుల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ కార్యాలయాలను ప్రారంభించినట్టు తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు ఫౌండర్ చైర్మన్‌గా ప్రారంభమైన ఈ సంస్థకు ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా రాచపల్లి బాలాజీ, కార్యదర్శిగా పెడబల్లె వికాస్, కోశాధికారిగా పుట్టా శివప్రసాద్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కర్ణాటక శాఖ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సభ్యులు ప్రసన్న, కార్తీక్, ఈశ్వర్, రాజు, మనోహర్, రాజేష్, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ ప్రదర్శన



ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలవరీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న కమిషనర్ డి.హరిత

**తిరుపతి కల్చరల్:** బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వినూత్నమైన డిజైన్లలతో ఏర్పాటు చేసిన బంగారు, వజ్రాభరణాల ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ అందరినీ ఆకర్షిస్తోందన్నారు. షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ ఆర్టిస్ట్రీ ప్రదర్శనలో డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం, మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహ, పార్టీ సంబరాల కోసం ఎరా అన్‌కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి ప్రెష్యా జాతి రత్నాభరణాలు, ఎతిక్స్ హస్తకళా నైపుణ్యంతో తయారైన తేలికపాటి ఆభరణాలు ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 11వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు.

## అవగాహనతో క్యాన్సర్‌కు చెక్



కేక్ కట్ చేస్తున్న సిపాయి సుబ్రమణ్యం

**తిరుపతి తుడా:** అవగాహన కలిగి ఉంటే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని ఎమ్మెల్సీ, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. రష్ ఆసుపత్రిలో ఆదివారం ఇంటర్నేషనల్ క్యాన్సర్ సర్వైవల్ డే (క్యాన్సర్ నుంచి కోలుకున్న దినోత్సవం)ను నిర్వహించారు. సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. 45 ఏళ్ల పైబడిన వారు విధిగా ట్యూమర్ టెస్టులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు లీలావతి, బాబు, స్టాఫ్ నర్స్ నాగ వేణి, దుర్గా స్వరూప, భారతీయ, లక్ష్మి, పూజిత, నిత్య తదితరులు పాల్గొన్నారు.